సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం ॥ 28 ॥ జనవరి ॥ 2023

వడ్డీ పెంచిన తపాలా శాఖ

తపాలా శాఖలో ప్రస్తుత త్రైమాసికానికి వడ్డీ రేట్లు పెంచినట్లు పోస్టల్ సూపరింటెండెంట్ రవి కుమార్ తెలిపారు.

10లో



రైతుల గుండెకోత

విద్యుత్ కోతలతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఎక్కడికక్కడ పంటలు వడలిపోతున్నాయి.

8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
34° / 18°

జిల్లాలో శనివారం కొద్దిమేర ఎండ ప్రభావం ఉండవచ్చు. రాత్రి వేళలో చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

స్వర్ణ కవచధారణలో రామయ్య

భద్రాచలంటౌన్: శ్రీసీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలో మూలమూర్తులు స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. శుక్రవారం సందర్భంగా లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారికి దర్బారు సేవ నిర్వహించి సంధ్యాహారతి సమర్పించారు.

పోలీస్ సిబ్బంది ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న ఎస్పీ డాక్టర్ వినీత్

కొత్తగూడెంటౌన్: ఎస్పీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన రాజబాబు కుటుంబానికి ఎస్పీ డాక్టర్ వినీత్ రూ.లక్ష చెక్కు అందించారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో రాజబాబు కుటుంబ సభ్యులకు పోలీసు సిబ్బంది సహకారంతో ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల ప్రతిఫలాలను అందజేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ మధు తదితరులు పాల్గొన్నారు..

11న జాతీయ లోక్ అదాలత్

కొత్తగూడెంటౌన్: ఫిబ్రవరి 11న జిల్లా కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి జి.భానుమతి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. క్రిమినల్, సివిల్, మనోవర్తి, మోటర్ వాహన ప్రమాద కేసులు, బ్యాంకు ప్రిలిటిగేషన్ కేసుల రాజీమార్గం ద్వారా సామరస్యంగా పరిష్కరించుకునేందుకు ఇది చక్కని అవకాశమని పేర్కొన్నారు.

తహసీల్దార్ల బదిలీలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ అనుదీప్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అశ్వాపురం తహసీల్దార్ వి.సురేష్‌కుమార్‌ను కలెక్టరేట్ ఎన్నికల విభాగానికి, ఎన్నికల విభాగం ఇన్‌చార్జ్‌గా ఉన్న ఎంఎ రాజును అశ్వాపురం తహసీల్దార్‌గా బదిలీ చేశారు. అశ్వారావుపేట తహసీల్దార్ సీహెచ్ ప్రసాద్‌ను పినపాకకు, జూలూరుపాడు తహసీల్దార్ జి.లూథర్‌విల్సన్‌ను అశ్వారావుపేటకు, కలెక్టరేట్ ఇ–సెక్షన్ సూపరింటెండెంట్ ఆర్.శారదను జూలూరుపాడు తహసీల్దార్‌గా, టేకులపల్లి తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావును కలెక్టరేట్ ఇ– సెక్షన్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. ములకలపల్లి తహసీల్దార్ ఎల్.వీరభద్రంను టేకులపల్లి తహసీల్దార్‌గా, భద్రాచలం డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సీహెచ్ శేషగిరిని ములకలపల్లి తహసీల్దార్‌గా, లక్ష్మీదేవిపల్లి నాయబ్ తహసీల్దార్ ఎస్‌కె అమ్జద్‌పాషాను భద్రాచలం డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. ఉత్తర్వులు తక్షణం అమలులోకి వస్తాయని పేర్కొన్నారు.

మెడికల్ బోర్డు ఏర్పాటు..

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ నిర్వహణలో తప్పుడు వైద్య ధ్రువీకరణ పత్రాల జారీ నియంత్రణకు మెడికల్‌బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర విద్యాశాఖా మంత్రి సబితా ఇంద్రారెడ్డి, టీఎస్‌ఈడబ్ల్యూ ఐడీసీ చెర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి అరుణ, డైరెక్టర్ దేవసేన ఉపాధ్యాయుల బదిలీలు, మన ఊరు–మన బడి కార్యక్రమంలో మోడల్ స్కూళ్ల ప్రారంభం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 25 మోడల్ పాఠశాలలు ఈనెలాఖరుకు ప్రారంభించడానికి సిద్ధం చేసినట్లు తెలిపారు. మరో 21 పాఠశాలలు రంగులు వేయడానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన సీనియారిటీ జాబితా డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా, పీఆర్ ఈఈ సుధాకర్, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ తానాజీ, ఇరిగేషన్ ఈఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి వెతలు..

- తలాపునే గోదావరి.. అయినా పొలాలన్నీ బీళ్లే..
- తాలిపేరు ప్రాజెక్ట్ ఉన్నా వానాకాలానికే నీళ్లు..
- దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో యాసంగి కష్టాలు
- సీతారామ పథకంలో చోటు దక్కని వైనం



యాసంగికి నీళ్లు లేక దుమ్ముగూడెంలో సాగు చేయకుండా వదిలేసిన పొలం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : దుమ్ముగూడెం, చర్ల మండలాలను ఒరుసుకుంటూ గోదావరి నది పారుతున్నా.. వేసవిలో చుక్క నీరు కూడా ఇక్కడి రైతుల పొలాల్లోకి రావడం లేదు. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో ఇక్కడ యాసంగి సాగు భారంగా మారింది. సాగు చేయకుండానే పొలాలను వదిలేయాల్సిన దుస్థితి నెలకొంది.

రైతులకు తప్పని ఇక్కట్లు..

తెలంగాణ వచ్చిన తర్వాత సాగునీటి ప్రాజెక్టులు శరవేగంగా నిర్మాణాలు జరుపుకుంటున్నాయి. సాగునీటి కాల్వల కింద భూముల్లో మూడు పంటలు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. కానీ గోదావరి అంచునే ఉన్నా దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని పొలాలకు మూడు పంటల మాట దేవుడెరుగు కనీసం రెండు పంటలు వేసే దిక్కులేదు. వేసవిలో ఈ రెండు మండలాల రైతులు సాగునీటి కోసం ఇక్కట్లు పడుతున్నారు. ఆఖరికి నీరు లేక ఇక్కడి యాసంగిలో దుక్కి దున్నకుండానే పొలాలను రైతులు వదిలేస్తున్నారు.

తాలిపేరు రొటేషన్..

ఈ రెండు మండలాలకు సాగునీరు అందించే లక్ష్యంతో తాలిపేరు ప్రాజెక్టు నిర్మించారు. రెండు మండలాల్లో కలిపి సుమారు 24,700 ఎకరాల ఆయకట్టు ఉంది. వానాకాలంలోనే ఈ రెండు మండలాల్లోని ఆయకట్టుకు సమృద్ధిగా నీరు అందుతోంది. వేసవి వచ్చిందంటే చాలు ఈ ప్రాజెక్టులో నీరు అడుగంటిపోతోంది. దీంతో ఒక ఏడాది దుమ్ముగూడెం మండలానికి నీరు విడుదల చేస్తే మరో ఏడాది చర్ల మండలానికి నీటిని విడుదల చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

యాసంగి కష్టమే..

ఖరీఫ్ సీజన్‌లో దుమ్ముగూడెం మండలంలో పద్దెనిమిది వేల ఎకరాల్లో సాగు చేస్తుండగా ఇందులో సుమారు ఏడు వేల ఎకరాల ఆయకట్టు తాలిపేరుపై ఆధారపడి ఉంది. అదే యాసంగికి వస్తే సాగు పదిహేను వందల ఎకరాలకు పడిపోతుంది. అది కూడా రెండేళ్లకోసారి. గతేడాది తాలిపేరు ప్రాజెక్టు ద్వారా దుమ్ముగూడెం మండలానికి యాసంగిలో నీటిని విడుదల చేశారు. దీంతో ఈ ఏడాది చర్ల మండలంలోని పొలాలకు యాసంగి నీరు అందుతుంది. రొటేషన్ పద్ధతి కావడంతో ఈ యాసంగిలో దుమ్ముగూడెం మండలంలో వేలాది ఎకరాలు సాగు చేయకుండానే వదిలేశారు. చర్ల మండలంలోనే ఇంచుమించు ఇదే పరిస్థితి ఉంది.



దుమ్ముగూడెం మండలంలో 1976లో నిర్మించిన లిఫ్ట్

'సీతారామ'లో చోటేది?

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో 6.45 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే లక్ష్యంతో సీతారామ ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఎక్కడో సుదూర ప్రాంతాల్లో పంటపొలాలను తడిపేందుకు గోదారమ్మను తరలిస్తున్నారు కానీ ప్రాజెక్టు నిర్మిస్తున్న దుమ్ముగూడెం, ముంపునకు గురవుతున్న చర్ల మండలాల్లోని పంట పొలాలకు నీరందించే ప్రణాళికేదీ అధికారుల వద్ద లేదు. ఈ రెండు మండలాల్లో దాదాపు మూడు వేల ఎకరాల భూమి ఈ ప్రాజెక్టు కారణంగా ముంపునకు గురవుతోంది. కానీ ఈ ప్రాజెక్టులో ఒడిసి పట్టే నీరు ఇక్కడి పొలాలకు అందే పరిస్థితి లేదు. కేవలం నది ఒడ్డున రైతులు మోటార్లతో నీటికి తోడు కోవడం తప్ప మరే ఇతర సదుపాయాలు, ప్రాజెక్టులు ఈ రెండు మండలాలకు లేవు.

చిన్న కాళేశ్వరం తరహాలో..

సుమారు యాభై ఏళ్ల కిందట జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉండగా ఏర్పాటు చేసిన ప్రగళ్లపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా కేవలం దుమ్ముగూడెం మండలంలో యాసంగిలో రెండు వందల ఎకరాలకు నీరు అందుతోంది. చర్ల మండలంలో ఈ తరహా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు లేవు. అన్నింటికీ ఒక్కటే తారక మంత్రం అన్నట్టు తాలిపేరు తప్ప మరో దిక్కులేదు. ఈ ప్రాజెక్టు సైతం వేసవిలో పూర్తి స్థాయిలో ఉపయోగపడని పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రయోజనాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిన తెలంగాణ ప్రభుత్వం, ఆ ప్రాజెక్టును నిర్మించిన మంథని నియోజకవర్గ అవసరాల కోసం చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టింది. ఇదే తరహాలో సీతారామ ప్రాజెక్టుకు భూములు త్యాగం చేసిన దుమ్ముగూడెం, చర్ల మండలాల రైతుల కోసం మరో ప్రాజెక్టుకు రూపకల్పన చేయాలని ఇక్కడి రైతులు డిమాండ్ చేస్తున్నారు.

70 యూనిట్లు.. 3,377 దరఖాస్తులు

- రూ. 68 లక్షల బడ్జెట్ కేటాయించిన ప్రభుత్వం
- మైనారిటీ రుణాలకు మస్తు పోటీ..

కొత్తగూడెంరూరల్ : రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరుకు నోటిఫికేషన్ జారీ చేయగా దరఖాస్తులు పోటెత్తాయి. 70 యూనిట్లు మంజూరు కాగా, నిరుద్యోగ యువతి, యువకుల నుంచి 3,377 దరఖాస్తులు వచ్చాయి. నాలుగేళ్లుగా మైనారిటీ నిరుద్యోగులకు ప్రభుత్వం రుణాలు ఇవ్వడం లేదు. దీంతో నోటిఫికేషన్ రాగానే అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. గత డిసెంబర్ 17 తేదీ నుంచి ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తుల ప్రక్రియ సాగింది. జిల్లాకు 70 యూనిట్లు మంజూరు కాగా అందులో రూ. లక్ష యూనిట్లు 49, రూ.రెండు లక్షల యూనిట్లు 21 ఉన్నాయి. ఇందుకు 3,377 మంది దరఖాస్తు చేసుకున్నారు. కొత్తగూడెం 131, కొత్తగూడెం అర్బన్ 407, పాల్వంచ 201, పాల్వంచ అర్బన్ 190, భద్రాచలం 104, ఇల్లెందు 321, ఇల్లెందు అర్బన్ 148, మణుగూరు 206, మణుగూరు అర్బన్‌లో 95 చొప్పున దరఖాస్తులు వచ్చాయంటే పోటీ ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. లబ్ధిదారులను మున్సిపాలిటీలో కమిషనర్, మండలంలో మండల పరిషత్ అధికారులు ఎంపిక చేయనున్నారు. దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ పెట్టి లబ్ధిదారులను ఎంపిక చేస్తారని తెలుస్తోంది. లబ్ధిదారులను ఎంపిక చేసి జిల్లా మైనారిటీ కార్యాలయం హైదరాబాద్‌లోని మైనారిటీ శాఖకు పంపిస్తే, రుణాలు మంజూరవుతాయి.



జిల్లా మైనారిటీ శాఖ కార్యాలయం

2016–17లో 8 మందికి రుణాలు

2016–17 సంవత్సరంలో వంద శాతం సబ్సిడీ కింద 8 మంది లబ్ధిదారులకు రూ. 50 వేల చొప్పున రుణాలు విడుదల చేశారు. 2017–18 నుంచి 2021–22 వరకు రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ రుణాలకు నోటిఫికేషన్ ఇవ్వలేదు. దీంతో నాలుగేళ్లుగా నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. మళ్లీ 2022–23 సంవత్సరానికి గత డిసెంబర్‌లో నోటిఫికేషన్ ఇచ్చారు. జిల్లలో సుమారు 80 వేల మంది మైనారిటీలు ఉన్నారు. వీరిలో ముస్లింలు 69 వేల మంది, బౌద్ధులు, పార్శీలు, జైనులు 10 వేలమంది ఉన్నారు. వీరికి రుణాల కోసం ప్రభుత్వం 70 యూనిట్లకు గాను రూ.68 లక్షల బడ్జెట్ కేటాయించింది.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



కంటి పరీక్ష చేయించుకుంటున్న కలెక్టర్

కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఐడీఓసీ కార్యాలయంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పక కంటి పరీక్షలు నిర్వహించుకోవాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. శుక్రవారం ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఐడీఓసీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాఖల వారీగా పరీక్షల షెడ్యూల్ తయారు చేయాలని ఏఓ గన్యాకు సూచించారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కంటి పరీక్షలు జరుగుతాయని తెలిపారు.



కలెక్టర్‌కు మెడికల్ రికార్డు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష

ఐడీఓసీలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది కలిపి 600 మంది వరకు ఉంటారని అందరూ కంటి పరీక్షలు నిర్వహించుకోవాలని అన్నారు. రీడింగ్ సమస్య ఉన్న వారికి కంటి అద్దాలు పంపిణీ చేస్తామని, ఇతర సమస్యలు ఉంటే రెండు వారాల్లో ప్రత్యేక కంటి అద్దాలు పంపిణీ చేస్తామని వివరించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష కంటి వెలుగు కార్యక్రమంలో నమోదు చేసిన ఐ స్క్రీనింగ్ మెడికల్ రికార్డును కలెక్టర్‌కు అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష, డీఆర్వో అశోకచక్రవర్తి, ఏఓ గన్యా, ప్రోగ్రాం అధికారి డాక్టర్ పర్షియా నాయక్, డాక్టర్ సుందర్ పాల్గొన్నారు.

గురుకులాల్లో నాణ్యమైన భోజనం

జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మల్లికార్జున్‌బాబు

పాల్వంచరూరల్: గురుకులాల్లో నాణ్యమైన భోజనం, నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా పౌరసరఫరాల అధికారి (డీఎస్‌ఓ) మల్లికార్జున్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లిలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల (సీఓఈ)ను శుక్రవారం ఆయన జిల్లా పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ డీఎం త్రినాథరావుతో కలిసి సందర్శించారు. కళాశాలలోని కిచెన్‌లో ఉన్న బియ్యం నిల్వలను, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సమస్యలు తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని తెలిపారు. జీసీసీ నుంచి నాణ్యమైన బియ్యం రాకుంటే వెనక్కు పంపించాలని, మళ్లీ నాణ్యమైన బియ్యం తెప్పించుకోవాలని సూచించారు. డీటీ కృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఎస్‌ఓ, డీఎం

వార్షిక లక్ష్యం సాధించిన పీకే ఓసీ-4



పీకేఓసీ-4 ప్రాజెక్ట్

మణుగూరుటౌన్: సింగరేణి మణుగూరు ఏరియాలోని పీకే ఓసీ–4 గని బొగ్గు ఉత్పత్తిలో రికార్డు సృష్టించింది. 65 రోజుల ముందుగానే 2022–23 వార్షిక లక్ష్యాన్ని సాధించింది. లక్ష్యం 37 లక్షల టన్నులుకాగా జనవరి 26 నాటికి 37 లక్షల 14 వేల టన్నుల బొగ్గు వెలికితీసినట్లు అధికారులు తెలిపారు. బొగ్గు రవాణాలోనూ రికార్డు సృష్టించినట్లు పేర్కొన్నారు. కార్మికులు, అధికారులు, సూపర్‌వైజర్ల సమష్టి కృషి, అంకితభావంతోనే లక్ష్యాన్ని సాధించామని మణుగూరు ఏరియా జీఎం జి.వెంకటేశ్వరరెడ్డి, పీకే ఓసీ ప్రాజెక్ట్ అధికారి టి.లక్ష్మీపతిగౌడ్, టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అమ్మవారికి శుక్రవారం ఘనంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. ముందుగా మేళతాళాలతో అమ్మవారి జన్మస్థలం వద్ద అర్చకులు పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్ అమ్మవారికి అభిషేకం, నివేదన, పంచహారతులు, నీరాజన మంత్రపుష్పార్చన నిర్వహించారు. పూజా కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ, దుర్గాప్రసాద్ శర్మ, ఆలయకమిటీ ఈఓ ఎస్.రజనీకుమారి పాల్గొన్నారు.

5న చండీహోమ పూజలు

ఆలయంలో వచ్చే నెల 5న చండీహోమ పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమపూజలో పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలను నమోదుచేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 98669 23261 నంబరులో సంప్రదించాలని కోరారు.



అభిషేకం చేస్తున్న అర్చకులు

గూడెం మున్సిపాలిటీకి రూ.115 కోట్లు..

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు రూ.115 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. డీఎంఎఫ్‌టీ ఫండ్స్ నుంచి రూ.75 కోట్లు, సీఎం స్పెషల్ ఫండ్స్ నుంచి రూ.40 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు త్వరలోనే టెండర్లు పిలుస్తామని, కొత్తగూడెం–పాల్వంచను జంట నగరాలుగా అభివృద్ధి చేస్తామని వివరించారు. పార్టీలకు అతీతంగా అన్ని వార్డులకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. నిర్వాసితులు, జర్నలిస్టులు సుమారు 4 వందల మందికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్నట్లు వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్‌చైర్మన్ దామోదర్, ఇండిపెండెంట్, కాంగ్రెస్, అధికారపక్షం కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా

'దుమ్ముగూడెం' జలపాతం..

అశ్వాపురం: మండల పరిధిలోని కుమ్మరిగూడెం గ్రామంలో గోదావరి నదిపై ఉన్న దుమ్ముగూడెం ఆనకట్ట జలపాతంలా చూపరులను ఆకట్టుకుంటోంది. 160 ఏళ్ల క్రితం నిర్మించగా, ఇప్పటికీ చెక్కు చెదరలేదు. పరిశ్రమలు, సాగు, తాగునీటి ప్రాజెక్ట్‌లకు జల నిధిగా ఉంటోంది. ఆనకట్ట వేసవి కాలంలో వారధిగా, వర్షాకాలంలో నీరు ఉప్పొంగుతూ, శీతాకాలంలో జలపాతంలా.. కాలానికో అందం సొంతం చేసుకుని ఈ ప్రాంత ప్రజలకు, సందర్శకులకు కనువిందు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఆనకట్టకు దిగువన సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మిస్తుండగా, అది పూర్తయితే ఈ ఆనకట్ట కనుమరుగు కానుంది.



ఇంటి పన్నుపై నజర్

- మున్సిపాలిటీల్లో ఇంటింటికీ తిరుగుతున్న సిబ్బంది
- పన్ను వసూళ్లకే ప్రత్యేకంగా కాంట్రాక్ట్ నియామకాలు
- నాలుగు పురపాలికల్లో వందశాతం సాధించేలా ప్రణాళిక

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీల్లో ఇంటి పన్ను వసూళ్లపై అధికారులు దృష్టి సారించారు. పురపాలకాల అభివృద్ధికి, కార్మికుల వేతనాలకు పన్ను వసూళ్ల ద్వారా వచ్చే నిధులనే వినియోగిస్తారు. ఈ క్రమంలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో వందశాతం పన్ను వసూళ్లు చేసేలా అధికారులు ముందస్తు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. మార్చి నెలాఖరులోగా లక్ష్యం పూర్తిచేసేలా బిల్ కలెక్టర్లను ఇంటింటికి పంపిస్తున్నారు. వసూళ్లకు వెళ్లిన బిల్ కలెక్టర్లు ఇంటి పన్ను మొత్తాన్ని యజమానులకు చెప్పి పన్ను కట్టించుకోవడం, కొంత గడువు ఇచ్చి ఆ లోగా చెల్లించాలని సూచనలు చేసి వెళ్తున్నారు. జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు మున్సిపాలిటీల్లో 7 నుంచి 10 మంది వరకు బిల్ కలెక్టర్లు ఉన్నారు. కొత్తగూడెంలో 36 వార్డులు, ఇల్లెందులో 24 వార్డులు, పాల్వంచలో 24 వార్డులు, మణుగూరులో 23 వార్డులుండగా బిల్ కలెక్టర్ల సంఖ్య, వార్డుల సంఖ్య కంటే తక్కువగా ఉండడం వల్ల అన్ని వార్డుల్లో పూర్తి స్థాయిలో వసూళ్లు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి అధిగమించేందుకు మున్సిపాలిటీ అధికారులు ఈ ఏడాది నూతనంగా రెండు నెలల కాలానికి పన్నుల వసూళ్లకు కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగులను నియమించి ఇంటి పన్ను వసూళ్లు చేయిస్తున్నారు. మున్సిపాలిటీ అధికారులు రూ.వేలల్లో బకాయిలు ఉన్న వారిని ముక్కు పిండి వసూళ్లు చేస్తున్నారని, రూ.లక్షల్లో బకాయిలు ఉన్న వారిని మాత్రం పట్టించుకోవడం లేదని పట్టణాల ప్రజలు ఆరోపిస్తున్నారు.



కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం

మున్సిపాలిటీల వారీగా పరిశీలిస్తే..

కొత్తగూడెం మున్సిపాలిటీ 20 వేల వరకు నివాస గృహాలు, వ్యాపార దుకాణాలు ఉన్నాయి. 2023–24 సంవత్సరంలో పన్ను రూ.4.73 కోట్లు వసులు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.3.23 కోట్లు వసూళ్లు చేశారు. లక్ష్యంలో 68 శాతం ఆదాయం రాబట్టారు. ఇల్లెందు మున్సిపాలిటీలో రూ.1.33 కోట్లు ఇంటి పన్ను లక్ష్యంగా ఉండగా రూ.99.28 లక్షలను అధికారులు వసూళ్లు చేశారు. ఈ రెండు మున్సిపాలిటీల్లో క్రమబద్ధీకరణ పట్టాల ప్రక్రియ ఉండగా, యజమానులు ముందస్తుగా ఇళ్ల పన్ను చెల్లించారు. మిగిలిన ఉన్న పన్నులను బిల్ కలెక్టర్లు వసూళ్లు చేయనున్నారు. మణుగూరు మున్సిపాలిటీలో రూ.1.25 కోట్ల ఇంటి పన్ను లక్ష్యం ఉండగా ఇప్పటివరకు 69 శాతం వసూళ్లు చేశారు. పాల్వంచలో రూ.4.29 కోట్లు లక్ష్యంగా కాగా రూ.2.95 కోట్ల పన్ను వసూళ్లు చేసి, 68 శాతం ఆదాయం రాబట్టారు.



ఇంటి పన్ను రశీదు ఇస్తున్న బిల్ కలెక్టర్

వందశాతం లక్ష్యంగా..



కొత్తగూడెం మున్సిపాలిటీలో ఇంటి పన్నులు వందశాతం వసూళ్లు అయ్యే విధంగా ప్రణాళిక చేసి అమలు చేస్తున్నాం. పూర్తి స్థాయిలో లక్ష్యం సాధించేందుకు బిల్ కలెక్టర్లను ఇంటింటికి పంపించి ఇంటి పన్నుల బకాయిలను వసూళ్లు చేయిస్తున్నాం. వందశాతం ఇళ్ల పన్నులు వసూళ్లు చేసి లక్ష్యం సాధిస్తాం.

–జి.రఘు, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

అటవీ రక్షణకు చర్యలు తీసుకోవాలి



అటవీ పునరుద్ధరణ పనులు పరిశీలిస్తున్న అధికారులు

గుండాల: మూగజీవాలతో పాటు అటవీ రక్షణపై చర్యలు తీసుకోవాలని ఎఫ్‌డీఓ నీరజ్‌కుమార్ పేర్కొన్నారు. కాచనపల్లి రేంజ్ పరిధిలోని కర్నిగూడెం సెక్షన్ సుద్దరేవు బీట్‌లో అటవీ పునరుద్ధరణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోడు పేరుతో చెట్లను నరకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేటగాళ్ల బారి నుంచి జంతువులను రక్షించాలని, వేటగాళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలను కాపాడాలని తెలిపారు. రానున్న వేసవిలో నీటి తొట్లు ఏర్పాటు చేయాలని, నిప్పు పెట్టకుండా అటవీ సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు అడవులపై అవగాహన కల్పించాలని వివరించారు. ఆయన వెంటన కాచనపల్లి రేంజర్ దీపిక, బీట్ ఆఫీసర్ మురళీకృష్ణ, జితేందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం చేరిన ఆదివాసీల యాత్ర



భద్రాచలం చేరుకున్న యాత్ర బృందం

భద్రాచలంఅర్బన్: మహబూబాబాద్ జిల్లాలో ఈ నెల 20 తేదీ నుంచి ప్రారంభమైన ఆదివాసీల ఇలవేల్పుల జోడాయాత్ర శుక్రవారం భద్రాచలం చేరుకుంది. కరకగూడెం మండలంలో ఈ నెల 31 నుంచి సమ్మక్క – సారక్క జాతర జరుగుతుంది. ఈ నేపథ్యాన ఉపవాస దీక్ష చేపట్టిన 20 మంది యాత్రగా బయలుదేరారు. వీరు భద్రాచలం మీదుగా కరకగూడెం వెళ్లనున్నారు. యావత్ ఆదివాసీ సమాజానికి సంబంధించిన ఇలవేల్పులు జాతరలో పాల్గొంటున్నాయని ఆదివాసీ తెగల సమన్వయ నాయకుడు సోయం కన్నారాజు తెలిపారు. ఈ యాత్రలో చుంచు రామకృష్ణ, ఇర్పా శ్రీను, జోగ శ్రీను, ఊకే చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: ఉరివేసుకుని ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ బి.రాజేశ్ కుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని మద్దిరావమ్మ గుడి సెంటర్‌కు చెందిన మళ్ల సత్యవేణి(34)కి వెంకటేశ్వరరావుతో వివాహం కాగా, వీరికి 9 ఏళ్ల కుమార్తె ఉంది. కాగా గుర్రాల చెరువు గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తికి సత్యవేణి కొంతమేర డబ్బులు, బంగారం ఆభరణాలు ఇచ్చింది. వీటిని తిరిగి ఇవ్వాలని అడుగుతుండగా ఇవ్వకపోవడంతో, ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన సత్యవేణి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి సోదరుడు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రెజర్ బాంబును నిర్వీర్యం చేసిన పోలీసులు

చర్ల: పోలీసు బలగాలను మట్టుబెట్టాలన్న లక్ష్యంతో మావోయిస్టులు ఏర్పాటు చేసిన ప్రెజర్ బాంబును గుర్తించిన పోలీసులు నిర్వీర్యం చేశారు. ఛత్తీస్‌గఢ్ – తెలంగాణ సరిహద్దు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కొండెవాయి సమీపాన అటవీ ప్రాంతంలో మావోయిస్టులు శక్తివంతమైన ప్రెజర్ బాంబు ఏర్పాటు చేశారు. పోలీసు బలగాలే లక్ష్యంగా ఈ బాంబును ఏర్పాటు చేయగా, గురువారం సాయంత్రం కూంబింగ్‌కు వెళ్లిన పోలీసు బలగాలు బాంబును గుర్తించి నిర్వీర్యం చేశాయి. శుక్రవారం చర్ల సీఐ అశోక్ వివరాలు వెల్లడిస్తూ.. మావోయిస్టులు ఏర్పాటు చేస్తున్న ప్రెజర్ బాంబులు, ట్రాప్‌ల కారణంగా ఆదివాసీలతో పాటు మూగజీవాల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని తెలిపారు. మావోయిస్టుల దుశ్చర్యలను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఖండించాలని కోరారు.

గుప్తనిధులు లభించాయని ప్రచారం

వైరా/కొణిజర్ల: వైరా మున్సిపాలిటీ పరిధి కొణిజర్ల మండలం శాంతినగర్ బీసీ కాలనీలో చేపట్టిన మట్టి తవ్వకాల్లో భారీగా బంగారం లభించిందంటూ శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగింది. బీసీ కాలనీలో వైరా రిజర్వాయర్ సమీపాన ఓ గుట్ట ప్రైవేట్ వ్యక్తి చేతిలో ఉంది. అక్కడ శుక్రవారం జేసీబీ సాయంతో మట్టి తవ్వకాలు చేపట్టగా భారీగా బంగారంతో కూడిన పెట్టె లభించిందని ప్రచారం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న కొణిజర్ల పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టగా అలాంటిదేమీ లేదని తేలింది. సామాజిక మాధ్యమాలో వచ్చే పుకార్లు నమ్మవద్దని ఎస్సై టి.యయాతి రాజు సూచించారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,881

రైతుల గుండె‘కోత’

- వ్యవసాయానికి విద్యుత్ లేక తిప్పలు
- నీటి తడులు అందక వాడిపోతున్న మొక్కలు
- కాత దశలో నీరందక మిర్చి రైతుల ఆందోళన



వడలిపోతున్న మిర్చి పంటను చూపిస్తున్న రైతు



మొలక దశలో వాడిపోతున్న మొక్కజొన్న

ఇల్లెందురూరల్: రైతులకు 24 గంటల పాటు విద్యుత్ అందిస్తున్నామనే ప్రభుత్వ పెద్దల మాటలు నమ్మి యాసంగిలో సాగు ప్రారంభించిన అన్నదాతలకు చేదు అనుభవం ఎదురవుతోంది. వాస్తవంగా 12 గంటల సమయం మాత్రమే వ్యవసాయానికి విద్యుత్ అందిస్తున్న అధికారులు పక్షం రోజులుగా ఆ కొద్దిపాటి గడువు కూడా ఏ సమయంలో ఇస్తారో తెలియక అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

బోర్లు, బావుల కింద పెరిగిన సాగు

ఈ సారి వానాకాలంలో అధిక వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలలోనూ ఇప్పటికే నీటి నిల్వలు దర్శనమిస్తున్నాయి. దీంతో భూగర్భ జలాలు అధికంగా ఉండటంతో బోర్లు, బావుల కింద యాసంగిసాగును అన్నదాతలు సంతోషంగా ప్రారంభించారు. కొంత మంది మిర్చి సాగు చేస్తుండగా మరికొందరు వరి, మొక్కజొన్న పంటలు కోసి యాసంగిలో మొక్కజొన్న, కూరగాయల సాగు ప్రారంభించారు.

విద్యుత్ సరఫరా తీరుతో చిక్కులు

ప్రస్తుతం మిర్చి రెండో దశ కాత కాస్తోంది. మొక్కజొన్న, కూరగాయల పంటలు మొలకదశలో ఉన్నాయి. ఈ సమయంలో వీటికి నీటి తడులు అధికంగా అవసరం. కానీ, పక్షం రోజులుగా విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో రైతుల అవస్థలు చెప్పనలవికాకుండా ఉన్నాయి. విద్యుత్ వినియోగం పెరగడంతో ట్రాన్స్‌కో అధికారులు దశలవారీగా విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించారు.

అర్ధరాత్రి సరఫరాపై ఆందోళన

మండలంలోని కొమరారం, మాణిక్యారం సబ్‌స్టేషన్‌ల పరిధిలో యాసంగి పంటలు అధిక విస్తీర్ణంలో సాగవుతుంటాయి. మూడు రోజులుగా పగలు మూడు గంటలు, రాత్రి వేళ ఐదు గంటలు మాత్రమే విద్యుత్తు సరఫరా జరుగుతోంది. అర్ధరాత్రి 12 గంటలకు విద్యుత్ సరఫరా ప్రారంభించడంతో ఆ సమయంలో చేను వద్దకు వెళ్లడం ఇబ్బందిగా ఉంటోందని రైతులు వాపోతున్నారు. వెళ్లినా ఉదయం 9 గంటలకు సరఫరా నిలిపివేస్తున్నారని, తిరిగి 10 గంటలకు ప్రారంభించినప్పటికీ తరచుగా బ్రేక్‌డౌన్ చేయడంతో చేను సరిగా తడవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మొలక దశలో ఉన్న మొక్కజొన్న, కూరగాయల పంటలు పూర్తిగా వడలిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. నేల నెర్రెలు వాయడంతో రైతులు పంటలపై ఆశలు వదులుకునే స్థితికి చేరుకున్నారు. ఇక మిర్చి పంట ప్రారంభం నుంచి వివిధ రకాల తెగుళ్లతో రైతులు ఇబ్బంది పడగా తీరా కాత దశలో విద్యుత్ సరఫరా సరిగా లేక నీటి తడులు అందక మొక్కలు వడలిపోతున్నాయి.

ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తున్నాం

రైతాంగానికి అందించే విద్యుత్ సరఫరాలో ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తున్నాం. ఉన్నతాధికారులు నిర్దేశించిన సమయంలో సరఫరా కొనసాగిస్తున్నాం. పగలు విద్యుత్ వినియోగం అధికంగా ఉండటం వల్ల రాత్రి వేళలో వ్యవసాయానికి అధిక సమయం విద్యుత్ అందిస్తున్నాం.

– రవి, ఏఈ, ఇల్లెందు మండలం

ఎండుతున్న మిర్చి పంట



రెండు ఎకరాల విస్తీర్ణంలో మిర్చి పంట చేశాను. పంట ప్రారంభంలో తెగుళ్ల తీవ్ర ఇబ్బందులకు గురిచేశాయి. ఎలాగోలా మొదటికోతను ఇంటికి చేర్చుకున్నాం. మొదటి కోతలో దిగుబడి తగ్గినా రెండోదశపై ఆశతో సస్యరక్షణ చర్యలు అందిస్తున్నాం. కానీ, పక్షం రోజులుగా విద్యుత్ సరఫరా తీరుతో పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి. – వాంకుడోత్ శ్రీను, రైతు, పోచారం

మొక్కజొన్నపై ఆశలు లేవు..



వానాకాలంలో అధిక వర్షాలతో మొక్కజొన్న దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. యాసంగిలో ఆశతో మొక్కజొన్న సాగు ప్రారంభించాం. మొలక దశలోనే నీటిని అందించలేకపోతున్నాం. భూగర్భంలో పుష్కలంగా నీరున్నా విద్యుత్ సరఫరా సరిగా లేక పంట ఎండిపోతోంది.

– భూక్య రాందాస్, రైతు, పోచారం గ్రామం

శిక్షణను పరిశీలించిన ఏపీఓ జనరల్



విద్యార్థినులతో మాట్లాడుతున్న డేవిడ్‌రాజ్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గిరిజన కళాశాలలో నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్, నీట్ శిక్షణ తరగతులను భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ జనరల్, ఆర్సీఓ డేవిడ్‌రాజు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న విద్యార్థినులను పలు ప్రశ్నలు అడిగారు. వారు చెప్పిన సమాధానాలతో సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ ఎం.దేవదాసు, బోధన సిబ్బందిని పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్‌కు నోటీస్

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 603 పరిధిలోని భూమిని తన ఆధీనంలో ఉంచుకున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ జానీపాషాకు తహసీల్దార్ కృష్ణవేణి శుక్రవారం నోటీసులు జారీ చేశారు. సర్వే నెంబర్ 603 పరిధిలోని 3.18 ఎకరాలు మున్సిపల్ వైస్‌చైర్మన్ జానీ తన ఆధీనంలో ఉంచుకున్నాడనే ఆరోపణల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. సదరు భూమికి సంబంధించి యాజమాన్య హక్కుగా కలిగి ఉన్న ధ్రువీకరణ పత్రాలు ఏమైనా ఉంటే ఏడు రోజుల వ్యవధిలో తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించాలని, లేనిపక్షంలో ఎనిమిదో రోజున ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకుంటుందని జానీకి జారీ చేసిన నోటీసుల్లో పేర్కొన్నట్లు తహసీల్దార్ కృష్ణవేణి తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల / కళాశాలలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు 2023–24 సంవత్సరానికి గాను అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, దరఖాస్తులకు చివరి తేదీ 30.01.2023 అని పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్‌లాల్ హట్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా గానీ, మీ సేవ కేంద్రాల ద్వారా గానీ చేసుకోవచ్చని, లేదా నేరుగా పాఠశాల / కళాశాలకి వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఇతర వివరాలకు 63007 08074, 94933 34736, 86392 70155, 97030 72559 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

రైతుల ఫిర్యాదుపై విచారణ



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

జూలూరుపాడు: సీతారామ కెనాల్ నిర్మాణంతో భూములు కోల్పోయిన పాపకొల్లు, పుల్లుడు తండా (భోజ్యాతండా) గ్రామాలకు చెందిన రైతులు నష్టపరిహారం రాలేదని జిల్లా కలెక్టర్ అనుదీప్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టారు. కొత్తగూడెం ఆర్డీఓ స్వర్ణలత, ఎఫ్‌డీఓ అప్పయ్య, ఇరిగేషన్ ఈఈ అర్జున్‌తో కూడిన అధికారుల బృందం సీతారామ కెనాల్ నిర్మాణం చేపట్టిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా భూములు కోల్పోయి నష్టపరిహారం రాని రైతులు, భోజ్యాతండా సర్పంచ్ లావుడ్యా కిషన్‌లాల్‌తో అధికారులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా పోడు భూమి సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నామని, తమ భూములను సీతారామ కెనాల్‌తో నష్టపోవాల్సి వచ్చిందని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు ఉన్న రైతులు కూడా అధికారులను కలిసి తమ భూములకు నష్టపరిహారం రాలేదని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ లూథర్ విల్సన్, ఇరిగేషన్ డీఈ అశోక్, ఎఫ్‌డీఓ ప్రసాద్‌రావు, అటవీ అధికారులు మల్లయ్య, రవి, గిర్దావర్ తిరుపతిరావు రైతులు పాల్గొన్నారు.

రైతుల పట్ల వివక్ష చూపుతున్నారు



మాట్లాడుతున్న కాసాని ఐలయ్య

సింగరేణి(కొత్తగూడెం): రైతుల సమస్యలను జిల్లా కలెక్టర్ పరిష్కరించడం లేదని, వివక్ష చూపుతున్నారని, ఆ అంశంపై లోకాయుక్తకు ఫిర్యాదు చేశామని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసాని ఐలయ్య పేర్కొన్నారు. శుక్రవారం మంచికంటి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2021 రబీ సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యానికి కాటా వేసి ఎన్ని డబ్బులు వస్తాయో రశీదులు రైతులకు ఇచ్చి బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తామని చెప్పారని, తీరా 5 నుంచి 20 శాతం వరకు కోత విధించి డబ్బులు వేశారని తెలిపారు. ఈ అంశంపై 2021 జూలై నుంచి అక్టోబర్ వరకు దశలవారీగా కలెక్టరేట్ చుట్టూ రైతులు తిరగగా ఆర్డీఓ ఆధ్వర్యంలో కమిటీ వేసి విచారించారని, ఆ విచారణలో రైతులకు నష్టం జరిగిందని తేలిందని చెప్పారు. అయినప్పటికీ రైతుల సమస్య పరిష్కారం కాలేదని, దీనిపై లోకాయుక్తకు, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, చీఫ్ సెక్రటరీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. సమావేశంలో అన్నవరపు సత్యనారాయణ, కునుసోత్ ధర్మ, కట్టా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమిపై లావాదేవీలకు పాల్పడితే చర్యలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలో టేకులపల్లి శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయానికి దాతలు ఇచ్చిన భూమికి సంబంధించి ఎవరైనా లావాదేవీలు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఏ.సులోచన తెలిపారు. నగరంలోని శ్రీశ్రీ సర్కిల్ ప్రాంతంలో 504 సర్వే నంబర్‌లోని 3–10 ఎకరాల భూమిని బొందిలి కన్నయ్య, లాల్‌సింగ్, బొందిలి కృష్ణాబాయ్‌లు 1996లో ఆలయానికి దూప దీప నివేదన కోసం రిజిస్ట్రేషన్ చేశారని పేర్కొన్నారు. కాగా, భూమిపై హైకోర్టు, దేవాదాయ శాఖ ట్రిబ్యునల్‌లో కేసులు కొనసాగుతున్నందున ఎలాంటి లావాదేవీలు చెల్లవని తెలిపారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ, ఏపీ సరిహద్దు ప్రాంతంలో భారీస్థాయిలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై శుక్రవారం ఉదయం పోలీసులు దాడి చేశారు. స్థానిక ఎస్‌ఐ రాజేశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కన్నాయిగూడెం గ్రామ సమీపంలో కొందరు వ్యక్తులు రహస్యంగా కోడి పందేలను నిర్వహిస్తున్నారు. ఈ పందేలకు స్థానికులతోపాటు ఏపీలోని పలు ప్రాంతాల నుంచి అధికంగా తరలివచ్చారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి కోడి పందేల స్థావరంపై దాడి చేసి రూ.1,63,960 నగదుతోపాటు రెండు ద్విచక్ర వాహనాలు, మూడు పందెం కోళ్ల స్వాధీనం చేసుకొని ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. మూడు కార్లు సీజ్ చేయగా, మిగిలిన వారంతా పరారయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోడి పందేలు ఆడుతున్న వారు అరెస్ట్

మణుగూరురూరల్: కోడి పందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు మణుగూరు సీఐ ముత్యం రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎం ఆఫీస్‌కు వెళ్లే రహదారి పక్కన గల మామిడితోట సమీపాన కొంతమంది వ్యక్తులు డబ్బులు పెట్టి కోడి పందేలు ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు ఆదేశాల మేరకు సీఐ ముత్యం రమేశ్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ పురుషోత్తం తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని.. వారి వద్ద నుంచి పది మోటార్ సైకిళ్లు, రూ.5,900 నగదు, మూడు సెల్‌ఫోన్లు, నాలుగు కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని సీఐ రమేశ్ వివరించారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

ఖమ్మం అర్బన్: ఖమ్మంలోని వైఎస్సార్ నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ రామకృష్ణపై ఈనెల 24న దాడి చేసి గాయపర్చడమే కాక ఆటోను ధ్వంసం చేసిన ఘటనలో ఇద్దరిపై శుక్రవారం కేసు నమోదైంది. కొద్దిరోజుల క్రితం ఒక యూట్యూబ్ చానల్ చేపట్టిన సర్వేలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఏ పార్టీ నుండి అయినా గెలుస్తాడని వైఎస్సార్ నగర్‌కు చెందిన రామకృష్ణ వెల్లడించాడు. దీంతో బీఆర్‌ఎస్ కార్యకర్తలు గోపాలపురం వద్ద ఆయనపై దాడి చేయడమే కాక ఆటోను ధ్వంసం చేశారు. ఈమేరకు మందడపు మనోజ్, బి.విజయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ రామకృష్ణ తెలిపారు.

నేటి నుంచి ‘సాక్షి’ ప్రీమియర్ లీగ్

ఖమ్మంస్పోర్ట్స్: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యాన సుధాకర్ పీవీసీ పైప్స్ సౌజన్యంతో నిర్వహిస్తున్న ‘సాక్షి’ ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ శనివారం ప్రారంభం కానుంది. ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో పోటీలను జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఎం.పరంధామరెడ్డి ప్రారంభిస్తారు. ఈ పోటీల్లో జూనియర్స్ విభాగం నుంచి 23 జట్లు, సీనియర్ విభాగంలో (డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలు) 26 జట్లు పాల్గొననున్నాయి. తొలుత జూనియర్స్ విభాగంలో జట్లకు నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు నిర్వహిస్తారు.

తొలిరోజు మ్యాచ్‌లు..

పోటీల తొలిరోజైన శనివారం జరిగే మ్యాచ్‌ల వివరాలిలా ఉన్నాయి. కృష్ణవేణి జూనియర్ కళాశాల – 2 (ఖమ్మం) – ఎక్సలెంట్ జూనియర్ కళాశాల (ఖమ్మం), వెలాసిటీ జూనియర్ కళాశాల (ఖమ్మం) – దరిపెల్లి డిప్లొమా కాలేజీ(ఖమ్మం), కృష్ణవేణి జూనియర్ కళాశాల – 1 (ఖమ్మం) – గౌతమబుద్ధ ఐటీఐ(ఇల్లెందు) జట్ల నడుమ మ్యాచ్‌లు జరుగుతాయి. అలాగే, ఎస్.ఆర్. జూనియర్ కళాశాల (ఖమ్మం) – సాహితీ జూనియర్ కళాశాల (ఖమ్మం), ఏఎస్‌ఆర్ జూనియర్ కళాశాల (ఖమ్మం) – రెజొనెన్స్ జూనియర్ కళాశాల(ఆర్‌పీఎల్ – ఖమ్మం), ఎస్‌బీఐటీ డిప్లొమా కాలేజీ (ఖమ్మం) – రెజొనెన్స్ జూనియర్ కాలేజీ (హాస్టల్ – ఖమ్మం), అనుబోస్ డిప్లొమా కాలేజీ (పాల్వంచ) – నయాబజార్ జూనియర్ కాలేజీ (ఖమ్మం), కిట్స్ డిప్లొమా కళాశాల (ఖమ్మం) – అబ్దుల్ కలాం డిప్లొమా కళాశాల (పాల్వంచ) జట్ల నడుమ మ్యాచ్‌లు జరగనున్నాయి.

రామయ్యను దర్శించుకున్న సినీ రచయిత భారవి



అధికారులకు విరాళం అందజేస్తున్న దాతలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి వారిని సినీ రచయిత జేకే భారవి శుక్రవారం దర్శించుకున్నారు. ప్రధాన ఆలయంలో స్వామిని దర్శించుకుని పూజలు చేశాక, అనుబంధ ఆలయాలైన లక్ష్మీతాయారు అమ్మవారిని, ఆంజనేయస్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెంట టీటీడీ హిందూధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్య పిలకా నాగేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి విజయవాడకు చెందిన భక్తులు రూ.లక్ష విరాళం అందజేశారు. పెద్దిబొట్ల శన్విత్, పెద్దిబొట్ల మహర్షి రూ.లక్షను ఆలయ అధికారులకు శుక్రవారం అందించగా, అర్చకులు స్వామి దర్శనం చేయించారు.

నేటి నుంచి సదరం స్లాట్ బుకింగ్ షురూ

చుంచుపల్లి: జిల్లాలో సదరం క్యాంపుల నిర్వహణకు అధికారులు తేదీలను ఖరారు చేశారు. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 28 వరకు జిల్లాలోని దివ్యాంగుల కోసం ప్రత్యేక సదరం క్యాంపులను నిర్వహించనున్నారు. ఇందుకోసం డీఆర్‌డీఏ అధికారులు సదరం క్యాంపుల షెడ్యూల్ తేదీలను శుక్రవారం ప్రకటించారు. సదరం క్యాంపులన్నింటినీ కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నారు. సదరం క్యాంపులకు హాజరు కావాలనుకునే వారు ముందుగా శనివారం నుంచి మీ సేవ కేంద్రాల ద్వారా తమ పేరు మీద స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ స్లాట్ బుక్ చేసుకోవాలనుకునేవారు ముందస్తుగా సంబంధిత మండలం, మున్సిపాలిటీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ చేత ప్రాథమిక పరిశీలన చేసి వికలాంగత్వం గుర్తింపు సర్టిఫికెట్‌తో పాటు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఫోన్ నంబర్‌ను మీ సేవ సెంటర్‌కు తీసుకెళ్లాల్సి ఉంటుంది. కొత్తగా నమోదు చేసుకునే వారితో పాటు తాత్కాలిక సదరం సర్టిఫికెట్ గడువు ముగిసినవారు కూడా స్లాట్ బుక్ చేసుకోవాలి. దీని కోసం రూ.35 రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెలలో 31న ఆ తరువాత ఫిబ్రవరి 3, 7, 14, 21, 24, 28 తేదీల్లో సదరం క్యాంపులు ఏర్పాటు చేశారు. దివ్యాంగులకు ఈ శిబిరాల్లో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం పక్షం రోజుల్లో సదరం గుర్తింపు పత్రాలను జారీ చేస్తారు. సదరం క్యాంపులను నిర్వహించేందుకు తేదీలు ఖరారు చేశామని, దాని ప్రకారం దివ్యాంగులు తమ పేరున శనివారం నుంచి స్లాట్ బుక్ చేసుకోవాలని డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

ఏజెన్సీ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందజేస్తున్న సీఆర్పీఎఫ్ అధికారులు

భద్రాచలంఅర్బన్: 14వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో ఏజెన్సీ విద్యార్థులు ప్రతిభ చూపారు. 141 బెటాలియన్, సీఆర్పీఎఫ్, ఖమ్మం ఎన్‌వైకే సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించగా, మైసూర్, పుదుచ్చేరి ప్రాంతాల్లో నిర్వహించిన ప్రోగ్రాంలో భద్రాచలం ఏజెన్సీ యువకులు 48 మంది పాల్గొన్నారు. విద్యార్థులు వారం రోజులపాటు ఆయా ప్రాంతాల్లో పర్యటించి అక్కడి సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకున్నారు. పుదుచ్చేరి పార్టిసిపెంట్స్ రూ. 10 వేలు, మైసూర్ పార్టిసిపెంట్స్ రూ. 5 వేలు రివార్డు అందుకున్నారు. కాగా టూర్‌కు వెళ్లే ముందు విద్యార్థులకు దుస్తులు, ఉపకరణాలను సీఆర్పీఎఫ్ అధికారులు అందించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఇక్కడ కూడా బహుమతులు అందించారు. కమాండెంట్ 141 బెటాలియన్ ప్రశాంత్ దర్, లతీఫ్ కుమార్, సాహు, కమల్వీర్ యాదవ్, సింగరవేల్, విజయ్ కిషోర్ రెడ్డి, హేమంత్ కుమార్ శర్మ, రాజ్‌కుమార్, రమాదేవి, వీరస్వామి పాల్గొన్నారు.